

# నవభూమి

## కరీంనగర్

అనుబంధం

10 మే,2025 శనివారం పేజిలు:5

www.epaper.navabhoomi.in


# కొనుగోళ్లలో జాప్యం




**పాలకుర్తి, -నవభూమి:** ఓదెలతోపాటు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత రైతులను బాధిస్తోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు దాటినప్పటికీ నేటికి ఆశించిన మేరకు కొనుగోలు, రవాణా సక్రమంగా కొనసాగడం లేదు. కేంద్రాల నిర్వాహ కులు అధికారులకు, మిల్లర్లకు ఇక్కడి పరిస్థితిని ఫోన్‌లో తెలిపినా ఎలాం టి స్పందన రావడం లేదు. మండలంలోని 11 ఐకేపి కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం బుధవారం నాటికి 4105.20 క్వింటాళ్లు, అలాగే దొడ్డు రకం 3869.40 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. అయినప్పటికీ మిల్లులకు ధాన్యం రవాణా లేకపోవడంతో ఎక్కడికక్కడే ధాన్యం నిల్వలు పేరుకుపో యాయి. అలాగే మరో 20 వేల క్వింటాళ్ల వరకు తూకం వేసినవి, వేయ నివి అలాగే ఉన్నాయి. మండల వ్యాప్తంగా వెయ్యి లారీలైతే గాని ధాన్యం మిల్లులకు చేరుకునే పరిస్థితి లేదు. సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరత తీవ్రంగా ఉండడంతో ధాన్యం బస్తాల లోడింగ్ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. ఐదు రోజుల క్రితం తూకం పూర్తయి లోడింగ్ కోసం వేచి ఉన్న బస్తాలు అలాగే మిగిలిపోయాయి. వాతావరణ మార్పు లతో వర్షాల భయం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఒక పక్క కేంద్రాల్లో పోసిన ధాన్యం తూకం వేయక, మరోపక్క వ్యవసాయ పనులకు రైతులు వెళ్ల లేక సతమతమయ్యే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం తూకం పూర్తి చేయించి, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.పాలకుర్తి మండలంలో కన్నాల, బామ్లానాయక్ తండా, జీడినగర్, రాణాపూర్, ఎల్కలపల్లి, పాలకుర్తి, కొత్తపల్లి, బసంత్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఇప్పటివరకు 37,600 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా 44,000 క్వింటాళ్ల ధాన్యం నిలువ ఉంది. అలాగే రామగుండం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలో జయ్యారం, గుడిపెల్లి, పుట్నూర్, ఈసాలతక్కళ్లపల్లి, కుక్కలగూడూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో ఇప్పటి వరకు 26,600 ధాన్యం కొనుగోలు చేయగా మరో 24,600 క్వింటాళ్ల ధాన్యం నిలువలు పేరుకుపోయాయి.కొనుగోళు కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారు లు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేయాలని మండల రైతులు కోరుతున్నారు..కంటి నిండ కునుకు ఉంటలేదు ఆసంశెట్టి రామయ్య , రైతు, ఓదెల ఇక్కడి కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం తూకం వేయడం లేదు. అడిగితే లారీలు లేవు అంటున్నారు. కొద్ది రోజుల్లో వ్యవసాయ పనులు మొదలవుతాయి. ఇటు వడ్లు అమ్ముడుపోక, అటు వర్షాల భయంతో కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇట్లా ఎప్పుడు కాలేదు. వెంటనే అధికారులు లారీల సౌకర్యానికి కల్పించి ఆదుకోవాలె.సన్న వడ్లు కొనడంలో జాప్యం చింతల మురళి, రైతు జయ్యారం సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ అందిస్తుందని తెలపడంతోపాటు అధిక మద్దతు ధర వస్తుందని ఆశతో అప్పులు చేసి 5 ఎకరాల 10 గుంటల్లో సన్న రకం వడ్లను పండించా. 15 రోజుల నుంచి కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నా. పగలు ఎండ, రాత్రి వీస్తున్న ఈదురుగాలులు, కారుమబ్బులతో దిగులు పడుతున్నా. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి.పొద్దంతా ఆరబెట్టుడే శ్రీరాముల లింగగౌడ్ కౌలు రైతు గుడిపెల్లి అప్పు చేసి 500 క్వింటాళ్ల సన్న ధాన్యం పండించా. 10 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. పగలు ఎండలకు ధాన్యాన్ని ఆరా పోస్తున్న. రాత్రి పూట వీస్తున్న ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులకు ఎప్పుడు వర్షం పడుతుందోననే ఆందోళన నెలకొంది. సన్న ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రావడం లేదని దీంతో జాప్యం జరుగుతుందని కేంద్రం నిర్వాహకులు అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కొనుగోళ్లు చేయాలి.

## ప్రజారోగ్యానికి

# రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**వేములవాడ -నవభూమి:** ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ. 19.99లక్షల విలువగల 53 సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచారన్నారు. ఈప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా, ఎల్‌వోసీల ద్వారా ఇప్పటి వరకు రూ.20కోట్ల పైచిలుకు మంజూరు చేశామన్నారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. గత ప్రభుత్వంలో అసలు గత ప్రభుత్వంలో ఎల్‌వోసీ అంటేనే ప్రజలకు తెలియని పరిస్థితి ఉండేదని, ప్రజా ప్రభుత్వంలో లెక్కకు మంచి ఎల్‌వోసీలు ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరంగా పేదలకు మెరుగైన సేవలు అంది స్తున్నామని, నియోజకవర్గ ప్రజలకు వైద్యం పరంగా ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా నూతనంగా రుద్రంగి మండలంలో రూ.1.43 కోట్లతో, ఫాజుల్‌నగర్‌లో రూ. 1.43 కోట్లుతో ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామన్నారు.రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు..ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నడుస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వర్షం పడి తడిసిన ధాన్యాన్ని కూడా తప్పకుండా కొనుగోలు చేస్తామన్నారు. కొందరు కావాలని రైతుల ముసుగులో రాజ కీయాలు చేస్తున్నారని, రైస్‌మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వకుంటే ఇంటర్‌మిడిట్ గోదాంలలో ధాన్యాన్ని నిలువ చేశామన్నారు. వారం పది రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్లు ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నా రు. ప్రతిరోజూ అధికారులతో, రైతులతో మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా చూస్తున్నామని, రైతులను అడ్డం పెట్టుకుని రాజకీ యాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అంతే కాకుండా కొన్ని విషయాలపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, భక్తుల మనో భావాలు దెబ్బతినకుండా పద్ధతి ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మీరూ అందించే సూచనలు, సలహా లు స్వీకరిస్తూ ముందుకు పోతున్నామని అన్నారు. త్వరలోనే రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధికి టెండర్ల ప్రక్రియ పూర్తి అయి నిబంధనల ప్రకారం పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.


# పడిపోతున్న భూగర్భ జలాలు



2

## ఇయ్యలేక.. కొర్రీలు..

# పథకాల అమలులో సర్కారు మెలిక



2

## ధాన్యం తరలింపులో ఇబ్బందులు లేకుండా చూడాలి



**సిరిసిల్ల -నవభూమి:** కొనుగోలు కేంద్రాలలో కోనుగోలు చేసిన ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనీ కలెక్టర్ సందీప్ కు మార్ ఝూ అన్నారు. గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ కలెక్టరేట్‌లో సంబంధి త అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి లక్షా 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. గంభీరావుపేట్, రుద్రంగి, వీర్నపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు ఇబ్బందులు వస్తున్నాయని, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర రవాణా వాహనాలు, హామా లీల సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. రవాణా వాహనాలు సరఫరా చేయ ని పక్షంలో సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం దిగుబడి చేసుకొని రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని సూ చించారు. జిల్లాలో ప్రతి మండలంలో అధికారులు చొరవతీసుకుని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు జరిగేలా చూడాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద అన్‌లోడింగ్ త్వ రగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే ఎస్మా చట్టం డిఫాల్ట్ రైస్‌మిల్లుల, రవాణా కాంట్రాక్టర్ మీద ప్రయోగించాలని, ఎక్కడైనా ఇతర ప్రాంత హామాలీలు అనే సాకుతో పనికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాల ని సూచించారు. రైస్‌మిల్లుల వద్ద ఎటువంటి కోతలు ఉండవద్దని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్ని బ్యాగులు సరఫరా చేయాలన్నారు. ఈ సమీక్ష సమా వేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీటీవో వి.లక్ష్మణ్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయాన్ని మూసివేయడం.. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే

**వేములవాడ -నవభూమి:** అభివృద్ధి పేరుతో ఆలయాన్ని మూసి వేసి అభివృద్ధి చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. పట్ట ణంలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి నివేదికలపై రహస్యం ఎందుకని ప్రశ్నించారు. రాజన్న ఆలయ నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని, ఆలయాన్ని మూసివేస్తే చిరు వ్యాపారులు తీవ్ర మనోవేదనకు గురువుతన్నారని అన్నారు. రోడ్డు విస్తరణ ఎక్కడి నుంచి ఎక్కడికి విస్తరిస్తారు తెలియజేయాలన్నారు. ఆగమశాస్త్రం వారి సలహాలతో ప్లాన్ చేయాలని సూచిస్తు న్నామని అన్నారు. ఆగమశాస్త్ర నిపుణుడిని, స్థపతిని నియమించారా అని ప్రశ్నిం చారు. డబ్బులు రాజన్న ఆలయ డిపాజిట్ నుంచి తీస్తున్నారా.. ప్రభుత్వం నుంచి వస్తున్నాయా వివరించాలని అన్నారు. డబ్బులు సరిపోక మధ్యలో అభివృద్ధి పను లు నిలిపివేస్తే భక్తుల పరిస్థితి ఏమిటని అని ప్రశ్నించారు. యాదగిరిగుట్ట తర హాలో ప్రణాళికలను రచించి ఆర్కిటెక్ట్ నియమించి 5 సంవత్సరాలలో పనులు పూర్తి చేశారని, మీరు రాజన్న ఆలయాభివృద్ధిని ఎలా చేస్తారో తెలియజేయాలని అన్నారు. గాజులు అమ్ముకునే మహిళలు, పూలు పండ్లు, ఆటో కార్మికులు, చిరు వ్యాపారుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాఘవరెడ్డి, రామతీ ర్థపు రాజు, క్రాంతికుమార్, రామ్మోహన్, సిరిగిరి చందు, గోలలి మహేష్, జోగిని శంకర్, నరాల దేవేందర్, శ్రీకాంత్‌గౌడ్, మల్లేశం, తదితరులు ఉన్నారు.




# పడిపోతున్న భూగర్భ జలాలు



**కరీంనగర్ -నవభూమి:** ఎండలు మండిపోతుండడంతో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. మార్చితో పోల్చితే ఒక్క నెలలోనే సగటున రెండు మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. జిల్లాలో గత మూడు రోజులు మినహా మిగతా రోజుల్లో 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతూ వస్తున్నది. కరీంనగర్‌తోపాటు పలు గ్రామాలకు తాగునీటి వనరు అయిన లోయర్ మానేరు డ్యాంలో నీటిమట్టం కనీస స్థాయికి పడిపోయే స్థితికి వచ్చింది. మిడ్ మానేరు నుంచి నీటిని వదలడంతో తాగునీటి ఇబ్బంవది తప్పింది. డ్యాం పూర్తి స్థాయి సామర్థ్యం 24.03 టీఎంసీలకు ప్రస్తుతం 6.93 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. డెడ్ స్టోరేజీ లెవల్ 2.5 టీఎంసీలకు వస్తే తాగునీటికి ఇబ్బంది ఏ ర్ప డ ు త ు ం ది. రో జు రో జు క ు.. ఆందోళనకరంగా..జిల్లాలో మార్చితో పోల్చితే ఏప్రిల్ మాసాంతానికి ఇల్లందకుంట మండలంలో 2.84 మీటర్ల లోతుకు నీరు పడిపోయింది. కరీంనగర్ అర్బన్ మండలంలో 2.22 మీటర్లు, చొప్పదండిలో 2.17 మీటర్ల లోతుకు నీరు పడిపోయి ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం జిల్లాలో చొప్పదండిలో 16.64 మీటర్ల లోతున, గంగాధరలో 16.62 మీటర్ల లోతున, కరీంనగర్ అర్బన్ మండలంలో 12.82 మీటర్ల లోతున, గన్నేరువరంలో 9.63 మీటర్ల, కొత్తపల్లిలో 9.53 మీటర్ల లోతున నీరు లభిస్తున్నది. హుజూరాబాద్ మండలంలో 9.51 మీటర్లు, తిమ్మాపూర్‌లో 9.32 మీటర్లు, చిగురుమామిడి మండలంలో 8.13 మీటర్లు, సైదాపూర్‌లో 7.80 మీటర్లు, ఇల్లందకుంటలో 6.17 మీటర్లు, కేశవపట్నంలో 6.16 మీటర్లు, కరీంనగర్ రూరల్ మండలంలో 5.46 మీటర్లు, జమ్మికుంటలో 4.69 మీటర్లు, వీణవంకలో 4.41 మీటర్లు, మానకొండూర్‌లో 4.21 మీటర్ల లోతున నీరు లభ్యమవుతున్నది. మార్చితో పోల్చితే ఏప్రిల్‌లో నీటి వినియోగం తగ్గింది. వ్యవసాయ అవసరాలకు నీటి వినియోగం తగ్గినా భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు వచ్చే పరిస్థితి కనిపిస్తున్నది.జల వనరుల్లో తగ్గుతున్న నీరు జల వనరులలో నీటి నిల్వలు తగ్గిపోతుండడంతో మిషన్ భగీరథకు ఇబ్బంది తప్పదేమో అనే ఆందోళన వ్యక్తమవుతున్నది. కరీంనగర్‌లో భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో బోరుబావులు ఎండిపోతున్నాయి. ఇప్పటికే అపార్ట్‌మెంట్లలో, విద్యానగర్ లాంటి ఎగువ ప్రాంతాల్లో బోర్లు అడుగంటిపోయాయి, కరీంనగర్ అర్బన్ మండలంలో 12.82 మీటర్ల లోతుకు నీరు పడిపోయింది. గత నెలలో 10.60 మీటర్ల లోతున నీరు లభ్యం కాగా ఇప్పుడు అది 12.82కు పడిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి.

### ఇయ్యలేక.. కొర్రీలు..

# పథకాల అమలులో సర్కారు మెలిక



**కరీంనగర్, -నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని సంక్షేమ పథకాలకు నిబంధనల పేరిట అడ్డగోలు కొర్రీలు పెట్టింది. మెజార్టీ పథకాలకు ఏదో ఒక మెలిక కనిపిస్తున్నది. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిస్తామని చెప్పి రాజీవ్ యువ వికాసం పేరిట అమలు చేస్తున్న పథకంలో కఠిన నిబంధలు పెట్టింది. 50 వేల నుంచి 4 లక్షల వరకు సబ్సిడీపై రుణాలు ఇస్తామని చెబితే వేల సంఖ్యలో జనం దరఖాస్తు చేసుకున్నారు. అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, జిరాక్సుల కోసం వందల్లో ఖర్చు చేశారు. తీరా సిబిల్ స్కోర్ ఉన్న వారికే రుణాలు ఇస్తామని కొత్త మెలిక పెట్టడంతో కంగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రుణాలు తీసుకున్న వారు, రుణాలు తీసుకొని చెల్లించని వారు అనర్హులని కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా గతంలో రుణాలు తీసుకున్న వారిని మినహాయిస్తే నిజానికి తప్పేమీ లేదు.కానీ, సిబిల్ స్కోర్ ఉంటేనే రుణాలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం మాత్రం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు చేస్తున్నది. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని, సక్రమంగా చెల్లించే వారికి మాత్రమే సిబిల్ స్కోర్ బాగుంటుంది. కానీ, రుణాలు తీసుకోని వారి పరిస్థితి ఏంటనేది ప్రభుత్వం ఆలోచించడం లేదు. వివిధ కార్పొరేషన్ల ద్వారా కరీంనగర్ జిల్లాలో ఈ పథకం కింద 57,763 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. మండల స్థాయిలో దరఖాస్తు పరిశీలన ప్రక్రియ కొనసాగుతుండగా, వచ్చే నెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. కానీ, వచ్చిన దరఖాస్తుల్లో చాలా మంది నిరుపేదలే ఉన్నారు. వీరికి బ్యాంకులతో ఎలాంటి సంబంధాలూ లేవు. అయితే, లేని సిబిల్ స్కోర్ ఎక్కడి నుంచి వస్తుందని ఆశావహులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ పథకం కింద బ్యాంకులు ఇచ్చేది నామ మాత్రమే అయినా, సిబిల్‌తో లింక్ పెట్టడం ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 10 శాతం మందికి కూడా రుణాలు అందే పరిస్థితి కనిపించడం లేదు.గ్యారెంటీల్లోనూ మెలిక ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేస్తున్న కొన్ని పథకాల్లోనూ ప్రభుత్వం ఇవే కొర్రీలు పెట్టింది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధానమైన హామీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇంటికి కూడా మెలిక పెట్టింది. గత జనవరి 26న లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేసిన ప్రభుత్వం మండలానికో గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేసింది. ఆ గ్రామాల్లో అందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని భావించిన దరఖాస్తు దారులకు నిరాశే మిగిలింది. ఇందిరమ్మ కమిటీలకు ప్రాధాన్యత ఇవ్వడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఎంపిక చేసిన వారే లబ్ధిదారులయ్యారు. ఈ రకంగా దరఖాస్తు చేసుకున్న కొందరిపై వేటు పడగా మిగిలిన వారు ఇండ్లు నిర్మించుకునే క్రమంలో పెట్టిన నిబంధనల మేరకు ఇబ్బందులు తప్పడం లేదు.ఇండ్లు మంజూరు ప్రొసీడింగులలో ఎక్కడా కొలతలు మెన్షన్ చేయక పోవడంతో లబ్ధిదారులు తమకు తోచిన విధంగా మార్కౌట్ చేసుకుని బేసిమెంట్లు నిర్మించుకున్నారు. తీరా 400 చదరపు గజాల నుంచి 600 చదరపు గజాలు మాత్రమే ఉంటే గానీ, బిల్లులు చెల్లించేదిలేదని కొర్రీలు పెట్టింది. దీంతో కొలతకు మించి ఇండ్లు కట్టుకున్న పదుల సంఖ్యలో లబ్ధిదారులు కంగుతిన్నారు. కట్టిన బేసిమెంట్లు కూల్చలేక, నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన ఇండ్లు ఉన్న కొందరు పక్కన ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నించినా అధికారులు ఒప్పుకోవడం లేదు. ఉన్న ఇంటిని కూల్చి కొత్తగా కడితేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారుల ముఖం మీదనే చెప్పేస్తున్నారు. ఇలాంటి కఠిన నిబంధనలతో వారు విసిగిపోతున్నారు.ఆత్మీయ భరోసా కరువే! ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట తెచ్చిన మరో పథకంలోనూ ఇదే పరిస్థితి. వ్యవసాయ కూలీలకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి 6 వేల చొప్పున ఏడాదికి 12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, వీరికి ఉపాధిహామీ కార్డు ఉండి ఏడాదికి 20 రోజులు పని చేసి ఉండాలని నిబంధన పెట్టింది. అంతే కాకుండా, దరఖాస్తుదారుల పేరిటగాని వారి కుటుంబ సభ్యుల పేరిటగాని గుంట భూమి కూడా ఉండ కూడదని మరో మెలిక పెట్టింది. దీంతో ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో వ్యవసాయ కూలీలు ఉన్నప్పటికీ వేళ్ల మీద లెక్కించే సంఖ్యలో ఉన్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తున్నది. ఉపాధి హామీ జాబ్ కార్డు, ఆధార్ కార్డులో లింకప్ అయిన బ్యాంక్ ఖాతా ఉంటేనే ఇప్పుడు ఇందిరమ్మ భరోసాకు ఎంపిక చేస్తున్నారు.

## పాలిసెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



**సిరిసిల్ల,-నవభూమి:** టీజీ పాలిసెట్ పరీక్ష నిర్వ హణ సజావుగా సాగే విధంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయా లని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మే 13న పాలిటె క్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల కోసం మే 13న ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు జరిగే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అవస రమైన అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశామని, 2136 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలి పారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాల తరలింపు, అవసరమైన బందోబస్తు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయా లన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద కరెంట్ కోతలు ఉండవద్దని విద్యార్థులకు అవసరమైన రూట్లలో బస్సులు నడిచేలా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాల న్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ చంద్ర య్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి, రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, ఆర్టీసీ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రత వ్యవస్థలను కట్టుదిట్టం చేయాలి

**కోల్‌సిటీ,-నవభూమి:** ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భద్రత వ్యవస్థలను కట్టుదిట్టం చేయాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. గురువారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌తోపాటు ప్రభుత్వరంగ సంస్థల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కమిషరేట్‌లో నిర్వహించిన సమావేశా నికి డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు. సీపీ మాట్లాడుతూ ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వరంగ సంస్థల ప్రాంతాల్లో అప్రమ త్తంగా ఉంటూ భద్రత వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల యంత్రాంగం సమన్వయం చేసుకుంటూ ఇండస్ట్రియల్ సంస్థల వద్ద భద్రతను పెంచాలని, అత్యవసర సర్వీసులు అందించే విభాగాలు, ఉద్యో గులు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కమిష నరేట్ పరిధిలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిరోధిం చడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీపీలు కరుణాకర్, భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, సీఐఎస్ఎఫ్ కమాండర్ సుదేష్ జక్కర్, చందన్ కుమార్, రాజు, సర్వర్, సమత, సింగరేణి జీఎంలు లలిత్‌కుమార్, సుదర్శన్‌రావు, వెంకటయ్య, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారి సోమనాథ్‌తో పాటు ఏసీపీలు, ఫైర్ ఆఫీసర్లు, సింగరేణి, ఎన్‌టీపీసీ అధికారులు పాల్గొన్నారు.




# 'ఎర్లీబర్డ్' అంతంతే



**సిరిసిల్ల -నవభూమి:** ఆస్తి పన్ను వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామపంచాయతీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలు సైతం ముందు వరుసలోనే నిలిచాయి. గ్రామపంచాయతీలతో పోల్చుకుంటే మున్సిపాలిటీల్లో 2024-2025 ఆస్తి పన్నుల వసూళ్లలో రూ.9.60 కోట్ల వరకు వసూలు చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీల్లో 96.99శాతం, వేములవాడలో 85.14శాతం పన్నులు వసూలు చేశారు. మున్సిపాలిటీల్లో ప్రతి సంవత్సరం ఎర్లీ బర్డ్ పేరిట ఐదు శాతం రిబేట్‌తో రాయితీ స్కీంలో ఆస్తి పన్ను చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం ఇస్తూ వస్తోంది. ఇందులో భాగంగా మార్చి 31 వరకు సాధారణ పన్నుల వసూలు ప్రక్రియ పూర్తికాగా, ఏప్రిల్ 30వరకు ఐదు శాతం రాయితీతో పన్నులు చెల్లించే అవకాశాన్ని ఇచ్చింది. ఏప్రిల్ 30వరకు కూడా ఆశించిన మేరకు పన్నుల వసూలు లేకపోవడంతో మే 7 వరకు అవకాశాన్ని పొడిగించినా రాయితీపై అంతంత మాత్రంగానే స్పందన వచ్చింది.ఎర్లీ బర్డ్‌లో రూ.3.77 కోట్ల వసూలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు 2025-26 ఆస్తి పన్నులకు సంబంధించి సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,778 భవనాలకు సంబంధించి రూ 9.75 కోట్లు లక్ష్యంగా ఉంది. ఇందులో 5 శాతం రాయితీని 5,117 ఇండ్లకు సంబంధించి వినియోగించుకున్నారు. 2.37 కోట్లు వసూలు కాగా 24.31 శాతంగా ఉంది. వేములవాడలో 15,002 భవనాలకు సంబంధించి 20.11 కోట్లు కాగా, 3,567 భవనాలకు సంబం?ధించి రూ.1.40 కోట్లు వసూలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ ఆస్తి పన్నులు మినహా ఇళ్లకు సంబంధించిన పన్నులో సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,487 ఇళ్లకు రూ.6.36 కోట్ల లక్ష్యానికి రూ.6.13కోట్లతో 96.99 శాతంతో ముందంజలో నిలిచారు. వేములవాడ మున్సిపాలిటీలో రూ.4.07కోట్లు లక్ష్యం కాగా రూ.3.47 కోట్లు వసూలు చేసి 85.14 శాతంతో నిలిచారు.పన్నుల వసూళ్లలో పల్లెలు అదర్శం..పన్నుల వసూళ్లలో పల్లెలు అదర్శంగా నిలిచాయి. 2024-25 మార్చి 31వరకు ఆస్తి పన్నుల వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలోనే ప్రథమంగా నిలిచింది. జిల్లాలో 260 గ్రామపంచాయతీల పరిధిలో వంద శాతం పన్నుల లక్ష్యాన్ని 99 శాతం పూర్తి చేశారు. జిల్లాలోని 12 మండలాల్లోని గ్రామపంచాయతీల్లో ఆస్తి పన్నుల్లో పాత బకాయిలతో కలిపి రూ.7 కోట్ల 21 లక్షల 42 వేల 291 వసూలు లక్ష్యం ఉండగా రూ.7 కోట్ల 12 లక్షల 27 వేల 901 వసూలు చేశారు. కేవలం రూ.9 లక్షల 15వేల 390 మాత్రమే బకాయిలు ఉన్నాయి. జిల్లాలో 12 మండలాల్లో 8 మండలాలు వంద శాతం వసూలు పూర్తి చేశారు. వంద శాతం లక్ష్యం సాధించిన మండలాల్లో చందుర్తి, కోనరావుపేట, ముస్తాబాద్, రుద్రంగి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, వేములవాడ రూరల్ మండలాలు ఉన్నాయి. 99 శాతంలో బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాలు ఉండగా తంగళ్లపల్లి 98 శాతం, గంభీరావుపేట 91 శాతంతో ఉన్నాయి. పన్నుల వసూళ్లలో బోయినపల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 51,65,364 రూపాయలకు 51,18,846 రూపాయలు వసూలు చేశారు. చందుర్తి మండలంలో 19 గ్రామపంచాయతీల్లో రూ.49,54,330కు వసూలు రూ.44,96,966, ఇల్లంతకుంట మండలంలో 35 గ్రామ పంచాయతీల్లో రూ.53,52,978కు వసూలు రూ.52,74,624, గంభీరావుపేట మండలంలో 22 గ్రామపంచాయతీల్లో రూ.70,02,546కు వసూలు రూ.63,88,255, కోనరావుపేట మండలంలో 28 గ్రామపంచాయతీల్లో రూ.44,82,537కు వసూలు రూ.44,96,966, ముస్తాబాద్ మండలంలో 22 గ్రామపంచాయతీల్లో రూ.1,07,02,265కు వసూలు రూ.1,06,73,103, రుద్రంగి మండలంలో పది గ్రామపంచాయతీల్లో రూ.29,59,690కు వసూలు రూ.29,47,630, తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామపంచాయతీల్లో రూ.88,33,109కు వసూలు రూ.86,52,434, వీర్నపల్లి మండలంలో 17 గ్రామపంచాయతీల్లో రూ.18,40,706కు వసూలు రూ.18,42,898, వేములవాడ మండలంలో 11 గ్రామపంచాయతీల్లో రూ.71,70,096కు వసూలు రూ.71,71,250, వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామపంచాయతీల్లో రూ.24,70,871కు వసూలు రూ.24,71,668, ఎల్లారెడ్డిపేట మండలంలో 26 గ్రామపంచాయతీల్లో రూ.1,12,08,799కు రూ.1,12,27,998 వసూలు చేశారు.

### రామగుండంలో రోడ్డు ధ్వంసం వివాదం..

# పోలీసుల అదుపులో మున్సిపల్ కాంట్రాక్టర్

**కోల్ సిటీ ,-నవభూమి:** రామగుండం నగర పాలక సంస్థలో రోడ్డు ధ్వంసం సంఘటన వివాదాస్పదంగా మారింది. నగర పాలక పరిధిలోని కృష్ణానగర్ లో ఇటీవల నూతనంగా నిర్మించిన రోడ్డును ఓ కాంట్రాక్టర్ ధ్వంసం చేసిన సంఘటన పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. మునుపెన్నడూ లేనివిధంగా జరిగిన ఈ సంఘటనతో నగర పాలక అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఐతే అధికారుల తప్పిదమా..? లేక కాంట్రాక్టర్ పొరబాటా? తెలియదు కానీ ఆ రోడ్డు ధ్వంసం చేసిన పాపానికి కాంట్రాక్టర్ శిక్ష అనుభవించాల్సి వస్తుండటం గమనార్హం. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని కృష్ణానగర్ ఏరియాలో నూతనంగా నిర్మించిన రోడ్డును ఓ కాంట్రాక్టర్ ఇతర పనుల నిమిత్తం తవ్వించాడు.అటుగా వెళ్లిన స్థానిక ప్రజాప్రతినిధి ఈ ధ్వంసంపై ఆరా తీయగా సదరు కాంట్రాక్టర్ తవ్వించాడని తెలియడంతో పిలిపించి తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఐతే రోడ్డు ధ్వంసంకు కారణమైన వారికి రూ.5లక్షల వరకు జరిమానా విధించాల్సిందేనని ఆదేశించినట్లు తెలిసింది. దీనితో ఎన్టీపీసీ పోలీసులు సదరు కాంట్రాక్టర్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఐతే నగర పాలక సంస్థ నీటి విభాగం ఇంజనీరింగ్ అధికారులు చెప్పడం వల్లనే ఆ రోడ్డు తవ్వినట్లు తెలుస్తోంది. ఈ విషయమై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జే.అరుణ శ్రీ ని వివరణ కోరగా, రోడ్డు ధ్వంసం మాట వాస్తవమేననీ, సదరు కాంట్రాక్టర్ వద్ద నుంచి వాంగ్మూలం తీసుకొని తదుపరి చర్యల నిమిత్తం కలెక్టర్ కు నివేదిక పంపించడం వరకే తన బాధ్యత అని పేర్కొన్నారు.చట్ట పరంగా ఏమైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటే పోలీస్ శాఖ పరిధిలో ఉంటుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇలాంటి సంఘటన రామగుండం కార్పొరేషన్లో జరగడం ఇదే మొదటిసారి కావడంతో నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అటు నగర పాలక ఇంజనీరింగ్ విభాగం అధికారులు సైతం తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారడంతో రామగుండం మెజార్టీ వర్గాల ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరి కను సన్న లో ఇదంతా నడుస్తుందని నగరం అంతా జోరుగా చర్చ జరుగుతుంది.



# ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితమైన ప్రయాణం.. కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్



**కోరుట్ల, -నవభూమి:** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణం చేయవచ్చని, ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించవద్దని కోరుట్ల టీజీ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రయాణీకుల ఆదరణపైనే ఆర్టీసీ సంస్థ మనుగడ ఆధార పడి ఉందన్నారు. ఇటీవల కొంతమంది ప్రైవేట్ వాహనాలకు చెందిన వారు సోషల్ మీడియా ద్వారా ఏయిర్పోర్టు నుంచి వాహనాలు ఖాళీగా వస్తున్నాయని, తమ వాహనాలను బుక్ చేసుకోవాలని మెసెజ్లు పంపుతున్నట్లు తెలిపారు. దీంతో ఆర్టీసీకి నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. డీపో నుంచి శంషాబాద్ విమానశ్రయానికి గతంలో రెండు బస్సులు ఉండగా ప్రస్తుతం 4 బస్సులు నడుపుతున్నామని, ఆంధ్ర ప్రదేశ్లోని కనిగిరి, పామూరు, వింజమూరుకు 4 బస్సు సర్వీసులను నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేసి సురక్షితమైన సుఖవంతమైన ప్రయాణాన్ని పొందాలన్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ప్రతీ ఒక్కరూ ఆర్టీసీ సంస్థకు ప్రోత్సాహం అందించాలని డీఎం విజ్ఞప్తి చేశారు.

# ముసుగులు తొడిగారు.. తీయడం మరిచారు.. 'కోరుకంటి' మార్క్ కనిపించొద్దనా..?



**కోల్ సిటీ ,-నవభూమి:** గోదావరిఖని తిలక్ నగర్ చౌరస్తాలోని జంక్షన్ కు వేసిన ముసుగు ఇప్పటికీ తొలగడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో రామగుండం నగర పాలక అధికారులు నిబంధనలకు లోబడి వీటికి ముసుగులు తొడిగారు. అయితే ఎన్నికలు పూర్తై కోడ్ ఎత్తివేసినా వీటిని తీయడం మాత్రం అధికారులు మరిచారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో నగరంలోని పలు చోట్ల ఈ జంక్షన్లను నిర్మించిన విషయం విధితమే. అయితే 'కోరుకంటి' మార్క్ కనిపించకుండా ఉండటం కోసమే ఆ ముసుగులను తొలగించకుండా వదిలేశారా..? అంటూ ఆ పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ముసుగులు తొడిగినంత మాత్రాన కోరుకంటి మార్క్ ను చెరిపివేయగలరా అంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా నగర పాలక అధికారులు తేరుకొని ముసుగులను తొలగించి ఆ జంక్షన్లను అధికారికంగా ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

# చిగురుమామిడిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**చిగురుమామిడి,-నవభూమి:** మండల కేంద్రంలోని శ్రీనివాస విజన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం శుక్రవారం నిర్వహించినట్లు కంటి పరీక్ష నిపుణులు తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరంలో 68మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 23 మందికి శుక్లాలో ఉన్నట్లు గుర్తించి వారిని హైదరాబాదులోని పుష్పగిరి కంటి దావఖానకు ఎలాంటి రవాణా ఖర్చు లేకుండా తీసుకెళ్లి కంటి ఆపరేషన్లకి తరలించినట్లు పేర్కొన్నారు. అవసరమగు వారికి చుక్కల మందులు అందజేశామని తెలిపారు. చిగురుమామిడిలోని శ్రీనివాస విజన్ సెంటర్లో ప్రతీ బుధ, ఆదివారాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో తిప్పారపు అంజలి , ఆడెపు వినోద , సతీష్ , కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



# స్కిల్ డెవలప్‌మెంట్‌తోనే విద్యార్థులకు భవిష్యత్




**రామగిరి,-నవభూమి:** సాంకేతిక విద్యలో స్కిల్ డెవలప్‌మెంట్‌తోనే విద్యా ర్థులకు భవిష్యత్‌కు బాటాలు పడుతాయని జేఎన్టీయూ యూనివర్సిటి వైస్ చాన్సలర్ కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల(మంథని)లో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో యూనివర్సిటి టిసిఎల్‌తో ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం కల్గిన ప్రతీ విద్యార్థికి నైపుణ్యత శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఉద్యోగ అవ కాశాలను కల్పించేందుకు కృషి చేస్తామని, అందుకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ ఏర్పా టు చేస్తామని పేర్కొన్నారు. ఇంగ్లీష్‌పై మరింత నైపుణ్యం పెంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం ఇంజనీరింగ్‌లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు గోల్డ్‌మోడల్స్, క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృ తిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రామగుండం ఏరియా క్వాలిటీ జీఎం బైద్య, ప్రిన్సి పాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవం విద్యార్థులు ఆధునిక సాంకేతికవైపు అడుగులు వేయాలని ట్రినిటీ ఎడ్యుకేషన్ ఇన్సిట్యూషన్స్ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో గురువారం ట్రినిటీ ఇంజనీరింగ్ క ళాశాల వార్షికోత్సవానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల 2008లో స్థాపించిన నాటినుండి ఎన్నో విజయాలు సాధిస్తూ కళాశాల న్యాక్ అక్రిడేషన్ పొందిందన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివే విధంగా కృషిచేయాలని, నిరంతర తపనతో ముందుకు గాసాలని ఆయన పేర్కొన్నారు. బీటెక్ ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అంద జేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. అకాడ మిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేషన్, హెచ్‌ఓడీలు డాక్టర్ నటరాజ్, ప్రభాకర్, స్వాతి, హెచ్‌ఓడి పద్మిని, హెచ్‌ఓడి డాక్టర్ ఆరీఫ్, ఏవో సురేష్, రాజిరెడ్డి, చొప్పరి వంశీ, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధిపై గోప్యత ఎందుకు?

**వేములవాడ,-నవభూమి:** రాజన్న ఆలయ అభివృద్ధి పనుల నివేదికలలో అంత రహస్యం ఏమి ఉందని, ఎందుకంత గోప్యత పాటిస్తున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. వచ్చే జూన్ 15 నుంచి ఆలయాన్ని మూసివేసి అభివృద్ధి చేస్తామని అధికారులు ప్రకటించడం భక్తుల మనోభావాలను కించపరిచినట్లేనన్నారు. పనులు కొనసాగిస్తూనే దర్శనాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. గురువారం వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఆలయ అభివృద్ధిని పూర్తిగా స్వాగతిస్తున్నామని, కానీ పనుల నివేదికలు విడుదల చేయకుండా, కనీసం వేములవాడ పట్టణ ప్రజలు, భక్తులు, ఆఖరికి ఆలయ ఉద్యోగులకు కనపడకుండా ఎందుకు సీక్రెట్‌గా ఉంచుతున్నారో ప్రభుత్వం, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చెప్పాలని ప్రశ్నించారు. నివేదికలు బహిర్గతం చేయాలన్నారు. డీపీఆర్ సిద్ధం చేశారా..? ఎన్ని నిధులు అవసరమో అంచనా వేశా రా..? అని ప్రశ్నించిన ఆయన, పనులను ఎప్పటివరకు పూర్తి చేస్తారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. 1979లో ఆలయ పునర్నిర్మాణం జరిగిందని, ఆ తర్వాత బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధికి అడుగులు పడ్డాయని గుర్తు చేశారు. అప్పుడు తాము చేపట్టబోయే పనులు ప్రజలు, భక్తులకు తెలిసేలా ఆలయంలోనే ఛాయాచిత్రాలను ఏర్పాటు చేసిన విషయాన్ని చెప్పారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఆలయ అభివృద్ధి విషయంలో గోప్యత ఎందుకు పాటిస్తున్నదో అంతుచికడం లేదన్నారు. ఆలయాన్ని బంద్ చేస్తే, గుడిమీదే ఆధారపడి బతుకుతున్న దాదాపు 5 వేల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు, భక్తులు, చిరువ్యాపారులకు ఇబ్బంది కలిగితే ఊరుకునేది లేదని, ప్రజల పక్షాన నిలుచుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దగ్గర నిధులు లేవని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల కుండబద్దలు కొట్టినట్టు చెప్పారని, మరి నిధులు లేకుండా ఆలయాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. సీఎం నవంబర్‌లో ఆలయానికి వచ్చి 76 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, దాదాపు ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కేటాయించలేదని, డబ్బులు రాకముందే ఇంత హంగామా ఎందుకని మండిపడ్డారు. ఆలయంలోని నగదు ఫిక్స్ డిపాజిట్లు తీసి అభివృద్ధికి వెచ్చించాలనే ప్రతిపాదన సిద్ధం చేస్తున్నట్టుగా తెలిసిందని, అదే జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆలయానికి సంబంధించి 110 కోట్ల ఫిక్స్ డిపాజిట్లు ఉన్నాయని, వాటి ద్వారా వచ్చే వడ్డీతోనే రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు, ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయని వివరించారు. జనరల్ ఫిక్స్ డిపాజిట్లు 20 కోట్లు, మరో 20 కోట్లు నిత్యాన్నదాన సత్రం నిర్వహణకు ఉన్నాయని చెప్పారు. జనరల్ ఫిక్స్ డిపాజిట్లు మినహా ఇతర నగదు డిపాజిట్లు ఏవి కూడా నిబంధనలకు విరుద్ధంగా తీయరాదని వివరించారు. 6.5కోట్లతో చేపట్టిన బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నదని, ముందుగా ఈ పనులు పూర్తిచేసిన తర్వాత రాజన్న ఆలయ అభివృద్ధికి పోతే మంచిదని సూచించారు. వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలోను 243 ఇండ్లను భూ సేకరణ ద్వారా సేకరిస్తున్నట్టు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం 315 ఇండ్లను చేర్చడం సరికాదన్నారు. అధికారం ఉంది కదా..! అని ఏకపక్షంగా వ్యవహరిస్తే ప్రజలు క్షమించరన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్, మాజీ కౌన్సిలర్లు సిరిగిరి రామ్‌చందర్, గోలి మహేశ్, జోగిని శంకర్, సీనియర్ నాయకులు ప్రసాద్ రావు, నరాల దేవేందర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మల్లేశం, అంజద్ పాషా, వాసాల శ్రీనివాస్, గుడిసె సదానందం, వెంకట్ రెడ్డి, పోతు అనిల్ కుమార్, చేపూరి రవీందర్, పైడి శ్రీనివాస్, సుంకాపాక రాజు, రవిచంద్ర గౌడ్, కట్ట తిరుపతి, సందీప్, హింగే కుమార్, అసద్, రాకేశ్, అనిల్, ప్రమోద్ ఉన్నారు.




# డ్రగ్స్ నిర్మూలించాలని చిగురుమామిడిలో భారీ ర్యాలీ



**చిగురుమామిడి,-నవభూమి:** డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రలో భాగంగా చిగురుమామిడి మండల కేంద్రంలో జేఏసీ మరియు మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ముగింపు సభ నిర్వహించారు. చిగురుమామిడి బస్టాండ్ నుండి సమావేశ మందిరం వరకు మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలు, భవిష్యత్తులో పడే ఇబ్బందులు, యువత చెడు మార్గంలో అవలంబిస్తున్న విధానాలను వివరించారు.డ్రగ్స్ వల్ల సామాజికంగా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా యువతను నష్టపోతున్నారన్నారు. నియోజవర్గంలో డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రకు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారని తెలిపారు. మండలంలో డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మహిళలు ముందుకు వెళ్లాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడమ్ లింగమూర్తి, మాజీ ఎంపీపీ కొత్త వీనీత, మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, ఏపీఎం మట్టెల సంపత్, నియోజకవర్గం కో ఆర్డినేటర్ ద్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేప్యాల ప్రకాష్, లోడీ సంస్థ ప్రతినిధులు ఉప్పుల కుమారస్వామి, గాండ్ల పద్మ, జేఏసీ బాధ్యులు వేముల జగదీష్, తాళ్లపల్లి జగన్, తాళ్లపల్లి ప్రభాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, వంగర మల్లేశం, ఎస్సై జగదీశ్వర్, సీసీలు గంప సంపత్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వెంకటమల్లు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంధే రజిత, కొల హరిణి, వీవోఏలు, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

# బేకరీలు, మెస్, రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారుల కొరడా

**కోరుట్ల,-నవభూమి:** పట్టణంలోని పలు తినుబండారుల షాపుల్లో మున్సిపల్ అధికారులు శుక్రవారం కొరడా ఝులిపించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక వాసవి మెస్, ఆర్ఆర్, భవర్చీ బిర్యానీ రెస్టారెంట్లు, డాల్ఫిన్ బేకరీలో మున్సిపల్ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్లు, మెస్ లో నిల్వ ఉంచిన కుళ్లిపోయిన మాంసం, ఆహర పదార్థాలు, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్రతమైన వాతావరణంలో తినుబండారాలు విక్రయిస్తున్న షాపు యజమానులకు రూ.18 వేల జరిమానా విధించారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడినచో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. వ్యాపారులు షాపుల నుంచి వెలువడిన తడి, పొడి, హానికారక చెత్తను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య వాహన సిబ్బందికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, బాలె అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీరు మహేష్, మున్సిపల్ సిబ్బంది హేమంత్, రాజు, రమేష్ పాల్గొన్నారు.



# 1818 మందికి నిలిచిన సింగరేణి పింఛన్లు..

## లైఫ్ సర్టిఫికెట్లు తీసుకుని పునరుద్ధరించాలని డిమాండ్

**గోదావరిఖని -నవభూమి:** సింగరేణి లో పని చేసి దిగి పోయిన కార్మికులు లైఫ్ సర్టిఫికెట్ లు ఇవ్వక పోవడం వల్ల 1818 మంది పింఛన్ దారులకు సింగరేణి పింఛన్ ఆగిపోయింది. ఈ అంశం కు సంబంధించి సీఎంపీఎఫ్ అధికారులు సంబంధించిన పింఛన్ దారులకు లైఫ్ సర్టిఫికెట్ లు పొందే విధంగా తగు ప్రకటన చేసి పెన్షన్ ను తీసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పని చేసి దిగిపోయిన ఉద్యోగులకు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ గత సంవత్సరం మార్చి 8 వ తేదీ నుంచి కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారని ఆయన అన్నారు. సమాచార హక్కు చట్టం-2005 అనుసరించి గోదావరి ఖని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ రీజినల్ కమిషనర్, కొత్త గూడెం రీజినల్ కమిషనర్ లకు లేఖలు రాసినట్లు పేర్కొన్నారు.అందుకు కొత్తగూడెం సీఎంపిఎఫ్ ప్రజా సమాచార అధికారి పంపిన లేఖలో కొత్తగూడెం సీఎంపిఎఫ్ రీజియన్ పరిధిలో 2134 మందికి కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారని, కొత్తగూడెం సీఎంపిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నుండి 18,111 మంది కోల్ పెన్షన్ పొందుతున్నారని, ప్రతీ నెల పెన్షన్ దారులకు రూ.20కోట్ల6లక్షల15వేల726 చెల్లిస్తున్నారని, 1818 మంది పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించక పోవడంతో వారి పెన్షన్ నిలిచిపోయిందని వారిచ్చిన సమాచారం లో పేర్కొన్నారని ఆయన తెలిపారు. ఈ సమాచారం ఇచ్చిన కోల్ మైన్స్ ప్రావిడెంట్ కొత్తగూడెం అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ లు సమర్పించని 1818 మంది పెన్షన్ దారులు ఆన్ లైన్ లో జీవన్ ప్రమాణ్ పత్రాన్ని సి.ఎం.పి.ఎఫ్ అధికారుల కు సమర్పించి పెన్షన్ పొందాలని ఆయన తెలిపారు.

# చేనేత, జౌళీ శాఖలో డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సుల్తానాబాద్ -నవభూమి:** రాష్ట్రంలో నూతనంగా మంజూరైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) హైదరాబాదు లో మొదటి సంవత్సరం 2025-26 విద్యా సంవత్సరంనకు గాను (60) సీట్లకు చేనేత, టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేత, జౌళీ శాఖ సహాయక సంచాలకులు విద్యాసాగర్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.2025-26 విద్య సవంత్సరానికి గాను కొండ లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) హైదరాబాద్ ద్వారా మూడు సవంత్సరాల ఈ కోర్సు కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు. కావున జిల్లాలోని యువత నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఈ కోర్సుపై అవగాహన సదస్సు మే 16న ఉదయం 11.30 గంటలకు సహాయ సంచాలకులు చేనేత, జౌళీ శాఖ కరీంనగర్ కార్యాలయములో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కావున జిల్లాలోని చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, ఇతర వివరాలకు సహాయ సంధాలకులు చేనేత, జౌళీ శాఖ, కరీంనగర్ కార్యాలయం, మంకమ్మ తోట ఫోన్ నంబర్లు 9849391548/8520079865ను సంప్రదించాలని సూచించారు.




# ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని ట్రాక్టర్ యజమానులు, గ్రామస్తుల రాస్తా రోకో



**ఎల్లారెడ్డిపేట,-నవభూమి:** వెంకటాపూర్, నారాయణపూర్ ఇసుక రీచ్ ల రద్దుపై మండల ప్రజలు, ట్రాక్టర్ యజమానులు మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. కామారెడ్డి -కరీంనగర్ ప్రధాన రహదారి పై తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా శుక్రవారం రాస్తారోకో చేశారు. ఎస్ఐ రమకాంత్, ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్నావారిని బలవంతంగా రోడ్డు పై నుంచి చెదరగొట్టారు. అనంతరం కొందరు ప్రతినిధులతో పాటు పలు పార్టీల నాయకులు తహసీల్దార్ సుజాతతో రీచ్ సమస్యపై మాట్లాడారు.ఒకే రీచ్ కు అనుమతి ఇవ్వడం వల్ల ట్రిప్పుకు రూ.3వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారని దీన్ని దృష్టి లో ఉంచుకుని అన్ని రీచ్ లకు అనుమతి ఇవ్వాలని పలు పార్టీల, గ్రామాల ప్రతినిధులు తహసీల్దార్ ను కోరారు. ఇసుక రీచ్ సమస్య పై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లుతానని తహసీల్దార్ సుజాత వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ కే గౌస్, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై సంబురాలు

**కోరుట్ల,-నవభూమి:** పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ సైనికులు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ కోరుట్లలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బైక్ ర్యాలీ తీశారు. కొత్త బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి, పటాకులు కాల్చి, స్వీట్లు పంచి పెట్టి సంబురాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కస్తూరి రమేశ్, జనరల్ సెక్రటరీ కొంపల్లి సురేశ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ సుతారి నవీన్‌కుమార్, ఫసీయొద్దీన్, లైబ్రరీ సెక్రటరీ మగ్రిపల్లి గంగాధర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ రాసభక్తుల రాజశేఖర్, న్యాయవాదులు గంగ్ర ప్రవీణ్‌కుమార్, తోకల రమేశ్, ఆడెపు వినోద్, గాంధారి శ్రీనివాస్, గోసికొండ సురేశ్, అల్లె రాము, బద్రి సృజన్, లావుడ్యా రాకేశ్, గణేశ్, వివేక్, శ్రీనివాస్, అనిల్, రాజు, రాజేందర్, రమేశ్, శివకుమార్ పాల్గొన్నారు.అలాగే, జగిత్యాలలోని ధరూర్ క్యాంపులో కాలనీవాసులు స్వీట్లు పంచిపెట్టి, పటాకులు కాల్చారు. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా దాడులు చేసిన భారత సైన్యానికి అందరం అండగా నిలువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధరూర్ క్యాంపు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు. మారుతీనగర్, మే 7: భారతదేశ ఆర్మీ సిందూర్ ఆపరేషన్ విజయవంతం చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టినందున మెట్‌పల్లి పట్టణంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం సంబురాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు తోపారపు నాగయ్య, చిన్నయ్య, మగ్గిడి సురేశ్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

